ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 28 డిసెంబరు 2024



ఒడ్డిమెట్ట వద్ద దాబాలో గో మాంసం వంటకాలు!

- రాష్ట్ర ధార్మిక పరిషత్ ప్రతినిధి కరాటే కల్యాణి తనిఖీ
- పోలీసులకు సమాచారం
- మాంసం కూరను సీజ్ చేసిన ఎస్ఐ

- 8లో



కన్నీటి సాగు!

ఏడాదంతా అన్నదాతలకు కష్టాలే

- ఒడిదుడుకుల్లో వరి సాగు
- ఆరంభంలో వర్షాభావం.. అనంతరం తెగుళ్లు దాడి
- పంట చేతికొచ్చే సమయంలో ముసురు
- పండిన పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాలను నిర్లక్ష్యం చేసిన కారణంగా రైతులు కష్టాలు పడుతున్నారు. ఈ ఏడాది కొంతకాలం వర్షాభావ పరిస్థితులు, మరికొంతకాలం అధిక వర్షాల వల్ల అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. ఆయా సమయాల్లో పంట పండదేమోనని, పండిన పంట చేతికి దక్కదేమోనని ఆందోళన చెందారు. వరి పంట చేతికి వచ్చే సమయంలో దాదాపు మూడు వారాలపాటు అల్పపీడనాలు, వాయుగుండాలతో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో ధాన్యం దిగుబడిపై ఆశలు వదులుకోవాల్సిందేనా అని గుబులు చెందారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి పంటల సాగు తీవ్ర ఒడిదుడులకు



శారదా నదిపై మరమ్మతులకు నోచుకోని గ్రోయిన్



కె.కోటపాడు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేలవాలి నీటమునిగిన వరిపైరు

కాలచక్రం 2024 వ్యవసాయం

లోనైంది. జూన్, జూలై నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో వరి నాట్లు ఆలస్యం అయ్యాయ. చెరకు మొక్క తోటలకు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఆగస్టులో వర్షాలు సంతృప్తికరంగా కురవడంతో కొంత ఆలస్యం అయినప్పటికీ వరినాట్లు పూర్తిచేశారు. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో వరి పైరు నీట మునిగింది. 662.32 హెక్టార్ల వరి పైరు దెబ్బతినడంతో కూటమి ప్రభుత్వం 2,846 మంది రైతులకు రూ.1.65 కోట్ల నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందజేసింది. తరువాత పలు రకాల తెగుళ్లు ఆశించడంతో వీటి నివారణకు రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. చీడపీడల కారణంగా కొంత పంట నష్టపోవడమే కాకుండా, పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. ఇక పంట పండి, కోతకు వచ్చిన దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనాలు, వాయుగుండాలు, ఒకసారి తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిశాయి. దీనివల్ల కోత కోసిన వరి పనలు తడిపోయాయి. వరి కోతలు వాయిదా వేసుకోవాల్సి రావడంతో ధాన్యం కొంతమేర రాలిపోయింది. ఒకానొక దశలో వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలతో వరి పంటపై ఆశలు వదుకోవాల్సిందేనా అని రైతులు ఆందోళన చెందారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటను కాపాడుకోవడానికి వరి పనలు పూర్తిగా ఆరకుండానే కుప్పలు వేసుకోవాల్సి వచ్చింది. వాతావరణం తెరపిచ్చినప్పుడు రైతులంతా ఒకేసారి వరి కోతలు, కుప్పల పనులు చేపట్టడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో సాధారణం కన్నా ఎక్కువ కూలి చెల్లించాల్సి వచ్చింది.

ఐదేళ్లలో సగానికి తగ్గిన చెరకు సాగు

జిల్లాలో రెండో ప్రధాన పంట చెరకు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు జిల్లాలో వున్న నాలుగు సహకార చక్కెర కర్మాగారాల్లో మూడు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వీటిని తెరిపించడానికి కనీస ప్రయత్నాలు చేయలేదు. దీంతో చెరకు రైతులు వేరే పంటలను సాగుచేయడం మొదలుపెట్టారు. వైసీపీ అధికారంలోకి రాకముందు ఐదేళ్ల క్రితం జిల్లాలో 40 వేల హెక్టార్లకుపైగా చెరకు సాగు చేసేవారు. ఈ ఏడాది 19,800 హెక్టార్లకు పడిపోయింది.

నీటి వనరులు అస్తవ్యస్తం

జిల్లాలో సాగునీటి వనరులను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఒక్కటంటే ఒక్క జలాశయాన్ని కూడా ఆధునీకరించేందుకు నిధులు కేటాయించలేదు. పంట కాలువల్లో వార్షిక నిర్వహణ పనులకు సైతం నిధులు విడుదల చేయలేదు. దీంతో కాలువల్లో పూడిక పేరుకుపోయి, తుప్పలు బలిసిపోయి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందని దుస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. జిల్లాకు జీవనాడి అయిన పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసింది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్టు పేర్కొనడమే తప్ప ఒక్క ఏడాది కూడా వాటిని విడుదల చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం ఎడమ కాలువ పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా ఇటీవల టెండర్లు కూడా పిలిచింది.

ధాన్యం కొనుగోలుపై వివాదం

తేమ శాతం అధికంగా ఉందంటున్న ప్రభుత్వ సిబ్బంది

- రెండు రోజులపాటు ఎండనిస్తే కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి వెల్లడి
- కల్లాల్లోనే ఉంచితే తడిసిపోతుందని రైతులు ఆవేదన
- తక్కువ రేటుకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోక తప్పదంటున్న అన్నదాతలు



గొలుగొండలో నూర్పు అనంతరం ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రైతు

గొలుగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

ధాన్యంలో తేమ శాతం అధికంగా వుందంటూ ప్రభుత్వ సిబ్బంది కొనుగోలు చేయడం లేదని మండలంలోని పలుగ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. కాగా నిర్ణీత ప్రమాణాలకన్నా ఎక్కువ శాతం తేమ వుంటే.. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని తిప్పిపంపుతున్నారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడిన అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో దాదాపు రెండు వారాల నుంచి ఆకాశం మేఘావృతంగా వుంటున్నది. రెండు, మూడుసార్లు మోస్తరు వర్షాలు సైతం కురిశాయి. అప్పటికే వరి పంట పండడంతో వాతావరణం అనుకూలంగా వున్నప్పుడు రైతులు కోత కోసి, కుప్పలు వేసుకున్నారు. అయితే వరి పనులు పూర్తిగా ఎండకముందే కుప్పలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వరి పంటను త్వరగా నూర్చుకోకపోతే ధాన్యం ముక్కిపోయే అకాశం వుంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల నుంచి వర్షాలు కురవకపోవడం, ఎండ కాస్తుండడంతో గొలుగొండ, పాతమల్లంపేట, అమ్మపేట, పప్పుశెట్టిపాలెం, పాకలపాడు, చోద్యం, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, విప్పలపాలెం, లింగపేట, చీడిగుమ్మల తదితర గ్రామాల్లో రైతులు వరి కుప్పల నూర్పు పనులు చేపట్టారు. ధాన్యం అమ్మకాల కోసం రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదిస్తున్నారు. వాళ్లు వచ్చి ధాన్యంలో శాతాన్ని పరీక్షించి, నిర్దత ప్రమాణాలకన్నా ఎక్కువ తేమ (17 శాతానికి మించి) వుందంటూ కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. దీంతో నూర్చిన ధాన్యాన్ని కల్లాల్లోనే వుంచేయాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ ఎండ అంతగా లేకపోవడంతో త్వరగా ఆరే పరిస్థితి లేదని అంటున్నారు. వర్షం కురిస్తే తడిపోయే అవకాశం వుందని వాపోయారు. ప్రభుత్వ సిబ్బంది ధాన్యం కొనుగోలు చేయకపోతే.. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ రేటుకు అయినా అమ్ముకోక తప్పదని చెబుతున్నారు. కాగా ధాన్యం కొనుగోలు చేయని విషయాన్ని మండల వ్యసాయాధికారి సుధావాణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, వర్షాల కారణంగా వరి పనలు పూర్తిగా ఎండకపోవడంతో ధాన్యంలో తేమ శాతం అధికంగా వుందని, కొద్ది రోజులు ఎండలో ఆరబెడితే తేమ శాతం తగ్గుతుందని అన్నారు. ధాన్యంలో తేమ 17 శాతం కంటే ఎక్కువ వుంటే తీసుకోవడానికి రైస్ మిల్లర్లు నిరాకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. నూర్పు అనంతరం రెండు, మూడు రోజులపాటు ధాన్యాన్ని ఎండలో ఆరబెడితే కొనుగోళ్లు చేపడతామని చెప్పారు.

విశాఖ స్మృతిలో మన్మోహన్ సింగ్

ప్రధానిగా మూడుసార్లు నగరానికి...

- 2006లో విశాఖ ఉక్కు విస్తరణ ప్రాజెక్టు జాతికి అంకితం
- 2008లో ఏయూలో నిర్వహించిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు హాజరు
- 2009లో న్యూక్లియర్ సబ్‌మెరైన్ అరిహంత్‌ను ప్రారంభించేందుకు సతీసమేతంగా రాక
- ఆయన మరణం దేశానికి తీరని లోటని పలువురి సంతాపం



విశాఖ స్టీల్‌ప్లాంట్ విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్. చిత్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, టీఎస్ఆర్, నేదురుమల్లి, కొణతాల, పాశ్వాన్, పప్పల చలపతిరావు (ఫైల్)

విశాఖపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

విశాఖ వాసుల స్మృతిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ప్రధానమంత్రి హోదాలో మన్మోహన్‌సింగ్ మూడు పర్యాయాలు విశాఖపట్నం వచ్చారు. రూ.8,692 కోట్లతో చేపట్టిన విశాఖ ఉక్కు కర్మాగారం విస్తరణ ప్రాజెక్టును 2006 మే 20న ఆయన జాతికి అంకితం చేశారు. పోటీ మార్కెట్‌ను తట్టుకుని నిలబడేందుకు ఉక్కు కర్మాగారం సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కర్మాగారం మరింత పురోభివృద్ధి చెందాలని, అందుకు కేంద్రం అన్నివిధాలా అండగా ఉంటుందని ప్రధాని హోదాలో ఆయన భరోసా ఇచ్చిన విషయాన్ని పలువురు కార్మికులు గుర్తుచేసుకుంటున్నారు. 2008లో రెండోసారి ఆయన నగరానికి వచ్చారు. దేశ శాస్త్ర, సాంకేతిక రంగాలకు దిశానిర్దేశం చేసే 95వ జాతీయ ... మిగతా 8వ పేజీలో

మన్మోహన్ సూచన మేరకు రైతుల ఆత్మహత్యలపై ఏయూ మాజీ వీసీ రొక్కం అధ్యయనం

దేశంలో రైతుల ఆత్మహత్యలు, గ్రామీణ భారతం రుణగ్రస్తంపై అధ్యయనం చేసే బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి దివంగత రొక్కం రాధాకృష్ణకు ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ అప్పగించారు. ప్రధానిగా 2006లో విదర్భ ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా అక్కడ రైతుల దుస్థితిని తెలుసుకున్న మన్మోహన్..తన సహచర మిత్రుడు, ఆర్థికవేత్త రొక్కం రాధాకృష్ణను స్వయంగా ఢిల్లీ పిలిపించి (విశాఖలో రాధాకృష్ణ ఉన్నప్పుడు ప్రధాని కార్యాలయం నుంచి ఒక అధికారి ఫోన్ చేశారు) రుణగ్రస్త గ్రామీణ ప్రాంతాలు, ఆత్మహత్యలపై అధ్యయనం చేయాలని సూచించారు. దీంతో రాధాకృష్ణ తన బృందంతో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, మరికొన్ని ప్రాంతాల్లో పర్యటించి 2007లో కేంద్రానికి నివేదిక పంపారు. నివేదిక రూపకల్పనలో ఏయూ నుంచి కొందరు స్కాలర్లు పని చేశారని రాధాకృష్ణ బంధువు, నెల్లూరు విక్రం సింహపురి మాజీ వీసీ ఆచార్య రొక్కం సుదర్శనరావు వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన వ్యక్తిగా మన్మోహన్‌సింగ్ ప్రతి భారతీయుడికి గుర్తుండిపోతారంటూ ఆయన మృతికి నివాళులు అర్పించారు.

నేడు కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం



అనకాపల్లి మెయిన్‌రోడ్డులోని కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనున్నది. ఆలయ కమిటీల ప్రతినిధులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని, మెయిన్ రోడ్డుని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం తెల్లవారు జామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు ప్రారంభం అవుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు తెలిపారు.

-అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

కొత్తవీధి బైపాస్ రోడ్డుకి మార్గం సుగమం

ఆగిన పనులను పూర్తిచేయించడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ

- 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు
- ప్రతిపాదనలు తయారు చేసిన మునిసిపల్ అధికారులు



డాన్‌బాస్కో కళాశాల వెనుక రూ.33 లక్షలతో అభివృద్ధి చేయనున్న రోడ్డు ఇదే

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

మునిసిపాలిటీలో అసంపూర్తిగా నిలిచిపోయిన కొత్తవీధి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు మార్గం సుగమం అయ్యింది. ఈ పనులను 15వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తి చేయడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకున్నారు. కొత్తవీధి శ్మశానవాటిక నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా వరకు రోడ్డుకి ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణానికి రూ.44.87 లక్షలు, చర్చి దగ్గర నుంచి డాన్‌బాస్కో కళాశాల వరకు బీటీ రోడ్డుకి రూ.33 లక్షలతో మునిసిపల్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వం వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి కొత్తవీధి మీదుగా పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 2.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసింది. ఈ ఏడాది మే నెలలో సాధారణ ఎన్నికల సమయానికి శ్మశానవాటిక నుంచి పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల ప్రహరీ గోడ వరకు కిలోమీటరు మేర బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. పెద్దచెరువు గట్టున జాతీయ నేతల విగ్రహాలు ఏర్పాటు చేసి రోడ్డుకి ఇరువైపులా మొక్కలు ... మిగతా 8వ పేజీలో

విద్యుత్ చార్జీలపై వైసీపీ ఆందోళన



మాడుగుల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు

మాడుగుల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీల విధింపును నిరసిస్తూ వైసీపీ నాయకులు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాల్లో శుక్రవారం ఈపీడీసీఎల్ కార్యాలయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్నదని ఆరోపించారు. అనంతరం ఏఈ రాంబాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బండరాళ్ల వాహనాలతో భయం భయం!

నిబంధనలు పాటించకపోవడంతో పొంచిఉన్న ప్రమాదం

రోలుగుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):

మండలంలో రాజన్నపేట, వడ్డిప క్వారీల నుంచి నల్లరాయిని రవాణా చేసే వాహనదారులు కనీస నిబంధనలు పాటించడం లేదు. ఎటువంటి రక్షణ చర్యలుచేపట్టకుండా భారీ బండరాళ్లను రాంబిల్లి మండలంలో ప్రత్యామ్నాయ నేవల్ బేస్ నిర్మాణ పనులకు తరలిస్తున్నారు. రాళ్లపై టార్పాలిన్లు లేదా వలలు కప్పడం లేదు. పైగా లారీ బాడీ ఎత్తుకు మించి రాళ్లను నింపుతున్నారు. రవాణా చేసే సమయంలో రోడ్లపై గతుకులు ఉన్నచోట లారీ కుదుపునకు లోనై, బండరాళ్లు కింద పడే ప్రమాదం వుంది. ఇవి ఎక్కడ తమ మీద పడతాయోనని పాదచారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక నిత్యం పదుల సంఖ్యలో అధిక బరువుతో భారీ వాహనాలు వెళుతుండడంతో ఇప్పటికే అంతంతమాత్రంగా వున్న రోడ్లు మరింత దారుణంగా తయారవుతున్నాయి. కొన్ని లారీలకు నంబర్ ప్లేట్లు లేవు. ఒకవేళ వున్నా- రిజిస్ట్రేషన్ నంబర్లు కనిపించడలేదు. వెనుకవైపు బ్లింకర్లు, డేంజర్ లైట్లు లేవు. రాత్రిపూట వెనుక నుంచి వచ్చే వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం వుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా లారీలో భారీ బండరాళ్లను తరలిస్తున్న దృశ్యం

సాగులో మెలకువలు పాటిస్తే సత్ఫలితాలు

» రైతులకు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచన » రాజుకోడూరులో కోసిన వరి పంట పరిశీలన



తడిసి రంగుమారిన వరి గింజలను పరిశీలిస్తున్న మోహన్‌రావు

రాంబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలను పండిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. కంబైన్ హార్వెస్టర్ (యంత్రం)తో వరికోతలు చేపట్టడం రైతులకు లాభదాయకంగా పేర్కొన్నారు. మండలంలోని రాజుకోడూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత కోసిన వరి పనలను, వరికుప్పలు, ఆరబెట్టిన దాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గింజ ఎనభై శాతం పసుపు రంగులోకి మారిన వెంటనే కంబైన్ హార్వెస్టర్‌తో కోయడం ద్వారా గింజ రాలడం జరగదన్నారు. కూలీలు, నూర్పుడి ఖర్చు తగ్గడమే కాకుండా సమ యం కూడా ఆదా అవుతుందని వివరించారు. రైతులు వరికుప్పలు వేసేటప్పుడు మధ్యలో కళ్ళు ఉప్పు, ఊక వేయడం ద్వారా గింజరంగు మారకుండా ఉంటుందన్నారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల వెరిఫికేషన్, ఈకేవైసీ, రైతుల అకౌంట్లను ఎన్‌పీసీఐకు లింక్ చేయించాలని వివరించారు. బ్యాంక్‌లను సంప్రదించి ఇప్పటి వరకు పంట రుణాలు పొందని కౌలు రైతులకు రబీలో రుణాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, వీహెచ్‌ఏలు కిశోర్, నాగేశ్వరరావు, వీఏఏలు కోటేశ్వరరావు, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రాంబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొరపూడి పంచాయతీ శివారు అప్పన్నపాలెంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు అందిస్తే క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. 45 రోజుల్లోగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని వివరించారు. అనంతరం ఆయన పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, ఎంపీటీసీ లాలం చినసత్యం, వీఆర్‌వోలు సుబ్రహ్మణ్యం, కుమార్, గ్రామ నాయకులు రుత్తల గణేశ్వరరావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



దాత అందించిన స్టడీ మెటీరియల్‌తో మూలజంప పాఠశాల విద్యార్థులు

రాంబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మూలజంప గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్ తన సొంత నిధులను వెచ్చించి స్టడీ మెటీరియల్ సమకూర్చారు. శుక్రవారం వీటిని అందజేసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అల్లవరపు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ వేగి రాము, ప్రధానోపాధ్యాయుడు ఎల్లాజీరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ పిల్లా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసంలో దీపారాధన శుభకరం



కొండకర్లలో దీపారాధన నిర్వహిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అచ్యుతాపురం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉందని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కొండకర్ల, అందలాపల్లి వేంకటేశ్వర ఆలయంలో రామబాణం ఆకారంతో దీపాలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసంలో దీపారాధన చేయడం అన్నివిధాలా శుభదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కొల్లి అప్పారావు, మోహనరావు, రమణ, సన్యాసిరావు, వెంకునాయుడు, భవాని, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు పలువురు నేతలు నివాళి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఆర్థిక సంస్కరణలకు పునాదిగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నిలిచారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఇక్కడి సహకార సంఘం వద్ద శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశ ప్రధానిగా రెండు పర్యాయాలు నిస్వార్థసేవలను ఆయన అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ మళ్ల జయమ్మ, కూటమి నాయకులు దాడి ముసిలినాయుడు, బద్దెం సూర్యనారాయణ, మొల్లేటి సత్యనారాయణ, టెక్కలి పరశురాం తదితరులు పాల్గొన్నారు. అలాగే, భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఘనతేనని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మునగపాకలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఇక్కడి వైసీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు నివాళులర్పించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం దేశానికి మన్మోహన్ అందించిన సేవలను కీర్తించారు. ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన ఘనుడుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, నాయకులు అర్రెపు గుప్తా, కోడిగుడ్డు రమణబాబు, దాసరి కుమార్, కొల్లి త్రినాథ్, శ్రీనురాజు, దూది నరసింహమూర్తి, పిల్లా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి తనకాల అనంతరావు అన్నారు. శుక్రవారం తిమ్మరాజుపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి ఆదిమూర్తి, జిల్లా కాంగ్రెస్ మత్స్యకార సెల్ అధ్యక్షుడు చోడిపల్లి సుభద్రరావు, కాండ్రేగుల సంజీవి, ఎల్లపు రాము, బీశెట్టి పెంటారావు, శరగడం జోగినాయుడు, బీశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిరా దేవి

అచ్యుతాపురం, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బేటీ బచావో కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని సీడీపీవో ఇందిరా దేవి సూచించారు. ఇక్కడి స్త్రీశక్తి భవన్‌లో శుక్రవారం ఏర్పాటైన కిశోరి వికాసం అవగాహన సదస్సులో మాట్లాడారు. 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికల్లో ఆత్మస్థైర్యం కలిగించేలా చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలపై పిల్లలతో పాటు వారి తల్లితండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంఈవో కృష్ణదేవరాయలు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి, లోవరాజు, పైడికొండ, అపరంజిని తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం వాయిదా

మునగపాక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద జరగాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం వాయిదా పడింది. తొలుత శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఈ కార్యక్రమం చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ మేరకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు విచ్చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో వాయిదా వేసినట్టు అధికారులు ప్రకటించారు.

ప్రజా సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం

మునగపాక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగులాపల్లిలో శుక్రవారం సీపీఐ శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు నాయుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం రాజీలేని పోరాటాన్ని సాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు డొక్కా పరదేశి, ఎం.గోవింద, గాంధీ, సూరిఅప్పారావు, లక్ష్మి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెజ్‌లో గల ఎస్‌వీ ఫార్మాలో ప్రమాదవశాత్తు ఇటీవల మృతిచెందిన కృష్ణ చైతన్య కుటుంబానికి యాజమాన్యం వెంటనే పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్వీ డ్రగ్స్‌లో ఇన్‌చార్జిగా పనిచేసిన ఎస్.కృష్ణ చైతన్య (35) గత నెల 28వ తేదీన కర్మాగారంలో ప్రమాదవశాత్తు పడిపోయి తీవ్ర గాయాలకు గురయ్యాడన్నారు. చికిత్స పొందుతూ ఈ నెల ఐదో తేదీన మృతిచెందినట్టు చెప్పారు. కానీ కర్మాగారం యాజమాన్యం నేటి వరకు ఆ కుటుంబానికి పరిహారం ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్‌శాఖ అధికారికి వినతిని అందిస్తున్న కన్నబాబు

ఎలమంచిలి/మునగపాక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ శ్రేణులు శుక్రవారం ఎలమంచిలిలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు క్యాంపు కార్యాలయం నుంచి ఈపీడీసీఎల్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు, అధికారంలో వచ్చిన తరువాత అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. అనంతరం ఏడీఈ ప్రకాశరావుకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, నాయకులు అర్రెపు గుప్తా, కోడిగుడ్డు రమణబాబు, దాసరి కుమార్, కొల్లి త్రినాథ్, శ్రీనురాజు, దూది నరసింహమూర్తి, పిల్లా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, విద్యుత్ చార్జీల పెంపుపై మునగపాకలో వైసీపీ శ్రేణులు పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. అంతకు ముందు అంతా కలిసి ర్యాలీగా ఇక్కడి విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మళ్ల సంజీవరావు, దాసరి అప్పారావు, దిమ్మల అప్పారావు, కాండ్రేగుల జగన్, ఆడారి కాశిబాబు, ఇల్లా నాగేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు కొత్తపేట విద్యార్థి ఎంపిక

ఎలమంచిలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 జాతీయ హాకీ పోటీలకు ఎలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కశింకోట పవన్‌కుమార్ ఎంపికైనట్టు హెచ్‌ఎం వైవీరమణ తెలిపారు. జనవరి ఒకటి నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించే పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నాడని వివరించారు. ప్రస్తుతం పవన్ కుమార్ ఏడో తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా అతనిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాల్సిందిగా అంతా ఆకాంక్షించారు.

కులగణన జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించండి

జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి.. కోటవురట్లలో తనిఖీలు



యండపల్లి సచివాలయంలో కులగణన జాబితాలపై ఆరా తీస్తున్న డీపీవో

కోటవురట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన జాబితాలపై అభ్యంతరాలు వస్తే స్వీకరించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని యండపల్లి, తంగేడు పంచాయతీల్లో శుక్రవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా సంపద కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రెండు గ్రామ సచివాలయలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే తంగేడు గ్రామంలో ఇంటింట సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సచివాలయల్లో గురువారం విడుదల చేసిన ఎస్సీ కులగణన జాబితాలను పరిశీలించారు. వీటిపై ఏమైనా అభ్యంతాలు వస్తే స్వీకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీపీ కార్యాలయ ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ రఘురామ్, యండపల్లి పంచాయతీ కార్యదర్శి రవికిరణ్, కోటవురట్ల పంచాయతీ కార్యదర్శి డీఎల్ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దండపురం సచివాలయంలో ఎంపీడీవో తనిఖీలు

నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురం సచివాలయాన్ని ఎంపీడీవో డి.సీతారామరాజు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడి పలు ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. రైతుల ఈకేవైసీ, ఈ సర్వీసెస్ నగదు జమ చేయడం, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, మిస్సింగ్ సిటిజన్స్ వివరాలు అప్‌లోడ్ చేయడం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల తయారీని చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈవోఆర్‌డీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ఎన్నో ప్రయోజనాలు

» జనసేన జిల్లా నేత గెద్దం బుజ్జి



మెగా వైద్య శిబిరంలో గెద్దం బుజ్జికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నక్కపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెలు, మత్స్యకార గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేద ప్రజలు, వృద్ధులు, మహిళలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతున్నాయని జనసేన పార్టీ జిల్లా నాయకుడు గెద్దం బుజ్జి అన్నారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో శుక్రవారం జనసేన నాయకుడు పిక్కి కోదండరావు(బుజ్జి), ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గెద్దం బుజ్జి ప్రారంభించారు. హెచ్‌సీజీ కేన్సర్ ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రి వైద్య నిపుణులు కేన్సర్ పరీక్షలతో పాటు పలు రకాల ఆరోగ్య తనిఖీలను ఉచితంగా నిర్వహించారు. పురుషులకు పీఎస్‌ఏ పరీక్షలు కూడా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వందలాది మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గెద్దం బుజ్జి మాట్లాడుతూ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బుజ్జిని పిక్కి కోదండరావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఇటువంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన కోదండరావును బుజ్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనర్స, ఎంపీటీసీ సభ్యుడు సత్తియ్య, కూటమి నాయకులు గంగరాజు,రాంబాబు, శివాజీ, కుందేటి దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

» పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్



ఉపాధ్యాయులకు లంచ్ బ్యాగ్‌లు అందిస్తున్న పీఆర్‌టీయూ నేత గోపీనాథ్

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్‌లకు 40 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఆదివారాలు స్టడీ అవర్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఏవీ.సూర్యనారాయణ, హరికృష్ణ, వీరభద్రరావు, ఉమామహేశ్వరరావు, జోగిరాజు, సత్యనారాయణ, సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజనానికి ఏర్పాట్లు

కోటవురట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెల 3వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు అమలు చేయనున్నట్టు మధాహ్న భోజన పథకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పథకం కోసం 270 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, ఇతర వంట తయారికీ అవసరమైన సామగ్రిని సిద్ధం చేశారు. రూ.45 వేలతో సామగ్రి కొనుగోలుచేసి కళాశాలలో సిద్ధం చేసినట్టు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్‌టీ సుజాత తెలిపారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి కళాశాల చదువుతున్న విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం తయారుచేసి పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, జోషి, అధ్యాపకులు కొండబాబు, జయరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ప్లేట్లు, వంట సామగ్రి



అన్నవరం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలబాబు

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

కోటవురట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ తిరుమలరావు చెప్పారు.మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందించిన ప్రతీ అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని, త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ సర్వేలో భూముల కొలతల్లో ఏమైనా తేడాలు ఉంటే రైతులు ఈ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, సదస్సులో వివిధ సమస్యలపై రైతుల నుంచి 13 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నేత శెట్టి విశ్వనాథం, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ నిరసన



పాయకరావుపేటలో ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా స్థానిక వై జంక్షన్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచి ప్రజలకు చుక్కలు చూపిస్తోందని ఆరోపించారు. గృహ వినియోగదారులపై మోపిన చార్జీల అదనపు బాదుడును వెనక్కి తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, నాయకులు బి.గోవింద్, వి.రామకృష్ణ, దత్తుడుబాబు, డి.సాయిబాబా, ఇసరపు తాతారావు, కె.దేవి, జగతా శ్రీను, చోడిపల్లి శ్రీను, వి.రామారావు, పి.లచ్చబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఐ ఓపెనర్స్ క్రిస్మస్ వేడుకలు

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐ ఓపెనర్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే.కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డాక్టర్ జాన్ డేవిడ్ దైవ సందేశం వినిపించారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘం యూత్ సభ్యులు, విద్యార్థులు, చిన్నారులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు, నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అనంతరం ఐ ఓపెనర్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే.కుమార్ తదితరులు క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికి పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఓపెనర్స్ సిబ్బందితో పాటు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

భారీగా రిజిస్ట్రేషన్లు.. 50కి పైగా కంపెనీల రాక

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ, యువకులు భారీగా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాలకు చెందిన 50 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కలిస్తాయని మంత్రి చెప్పారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాను పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ధనుర్మాస సమారాధన

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధా రుక్మిణీ సహిత పాండురంగస్వామి దేవస్థానంలో శుక్రవారం ధనుర్మాస అన్న సమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాండురంగస్వామి, అమ్మవార్లకు ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి, నారాయణాచార్యులు విశేష పూజలు చేశారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెద్దం బుజ్జి, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, దేవస్థానం మాజీ చైర్మన్‌లు యాళ్ల వరహాలు, డి.సాయిబాబా, భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ధనుర్మాస సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో కె.దివ్యతేజ, వికాసతరంగిణి సభ్యులు, ఆలయ సిబ్బంది సేవలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోటవురట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సమగ్ర నివేదికతో హాజరుకావాలని ఆయన కోరారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి వైసీపీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్ చిత్రపటానికి వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా ప్రచార పబ్లిక్ వింగ్ అధ్యక్షులు డి.సాయిబాబా, వైసీపీ పట్టణ అధ్యక్షుడు డి.బాబి, నాయకులు డి.శ్రీనివాసరావు, జె.శ్రీను, డి.రాజేశ్ ఖన్నా, కె.నరేష్, పద్మారావు, పి.వీరబాబు పాల్గొన్నారు.

వేమగిరిలో రెవెన్యూ సదస్సు

ఎస్.రాయవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కె.రమేష్‌బాబు వివిధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

టీడీపీ శ్రేణులకు పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పిలుపు

పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న గండి బాబ్జీ

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి సూచించారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో స్థానిక గౌతలచ్చన్న నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సభ్యత్వ నమోదు తక్కువగా ఉన్న గ్రామాలపై మరింత దృష్టి సారించాలన్నారు. ద్వితీయశ్రేణి నాయకులు సభ్యత్వ నమోదులో పాలు పంచుకోవాలన్నారు. సభ్యత్వ నమోదు మందకొడిగా సాగడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఏఏ గ్రామాల్లో సభ్యత్వ నమోదు తక్కువగా ఉందో అడిగి తెలుసుకున్నారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, పార్టీ నాయకులు గొర్లె కనకారావు, ఇందల కొండలరావు, ఒమ్మి వెంకటరావు, బొడ్డపల్లి అప్పారావు, సూరాడ బంగార్రాజు, రాయవరపు దేముడు, వర్రి వసంతరావు, పైలా రామచంద్రరావు, కేఆర్‌కే రాజు, మచ్చా శివకుమార్, పైలా చిన అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలి'



ఈపీడీసీఎల్ కార్యాలయ ఏఏవోకు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

నకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ నాయకులు శుక్రవారం ఇక్కడ పోరుబాట నిర్వహించారు. తొలుత రింగు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ బైక్ ర్యాలీని ప్రారంభించారు. నిదానందొడ్డిలోని ఈపీడీసీఎల్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక పెంచడం తగదన్నారు. తక్షణమే పెంచిన చార్జీలు తగ్గించడంతో పాటు హామీలను అంలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఏఏవో పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, కశింకోట జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, వైసీపీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మందపాటి జానకిరామరాజు, మలసాల కిశోర్, జాజుల రమేష్, మళ్ల బుల్లిబాబు, కేఎం నాయుడు, కోరుకొండ రాఘవ, భీశెట్టి జగన్, గ్రైహరి రాజు, ఏపీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో దృష్టికి కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు



డీఈవోకు వినతిని అందిస్తున్న ప్రతినిధులు

కొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనివాస్‌బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం మిగిలి ఉన్న క్యాజువల్ లీవులను వాడుకునే విషయంలో మూడు సెలవులకు మించకుండా వాడకూడదనే నిబంధనలపై చర్చించారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందిస్తూ అనారోగ్యం ఉంటే సెలవులను పూర్తిగా వాడుకోవచ్చని తెలిపారని సంఘం నాయకులు విలేకరులకు తెలియజేశారు. మూడు రోజులే సెలవులు వాడాలన్న నిబంధన లేదని తేల్చి చెప్పారన్నారు. అలాగే కేజీబీవీల్లో ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు లేకపోవడం వల్ల సీఎల్స్ అవసరం మేరకు డిసెంబరులో వాడుకోవచ్చని చెప్పారన్నారు. వంద రోజుల ప్రణాళికలో సెలవు దినాలను మినహాయించాలని కోరామన్నారు

జీవీఎంసీ కార్మికుల సమస్యలపై జడ్సీకి వినతి



జోనల్ కమిషనర్ రమణకు సమస్యలు వివరిస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ బీవీ రమణను కార్మికులు కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అదనంగా నియమించిన 15 మంది కార్మికులకు ఎనిమిది నెలల నుంచి వేతన బకాయిలు చెల్లించడం లేదన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో వీరిని కలపాలని కోరారు. జడ్సీని కలిసిన వారిలో నాయకులు ఎర్రంశెట్టి శివకుమార్, జలగడుగుల శివకుమార్, నీలాపు లోకేశ్, సింగంపల్లి నాగమణి తదితరులు ఉన్నారు.

దెబ్బతిన్న వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలి



ఇరువాడలో మొలకెత్తిన గింజలను చూపిస్తున్న రైతు ఉల్లి పెంటయ్య

సబ్బవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా మూడు నాలుగు రోజుల పాటు కురిసిన చిరు జల్లులకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటకు నష్టం ఏర్పడింది. దీంతో ఆయా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇరువాడ, అసకపల్లి, గుల్లేపల్లి, సబ్బవరం, ఆదిరెడ్డిపాలెం, అంతకాపల్లి, రావలమ్మపాలెం, వంగలి, అమృతపురం తదితర గ్రామాల్లో కోసి ఉంచిన వరిపనలు నీట మునిగాయి. ప్రస్తుతం వాటిని నుంచి మొలకలు వస్తుండడంతో వాటిని చూసిన ఆయా రైతులు ఆందోళన చెందున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తమను ఆదుకోవాల్సిందిగా వారంతా కోరుతున్నారు.


'రెవెన్యూ సదస్సులతో సమస్యలకు సత్వర పరిష్కారం'

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ తెలిపారు. మండలంలోని కలపాకలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. అర్జీలు చేసుకున్న 45 రోజుల్లోగా సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం 36మంది అర్జీలను సమర్పించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవాలు

భారీ ఏర్పాట్లు చేపట్టిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు

వేకువజాము నుంచి పూజలు ▸▸ రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు



విజయరామరాజుపేటలో కొలువు దీరిన గౌరీ పరమేశ్వరులు



కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయానికి పుష్పాలంకరణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాతిగాంచిన పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల కుంచావారి గౌరీ పరమేశ్వరులు, విజయరామరాజుపేటలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవాలు శనివారం ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఆయా కమిటీల ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. కుంచావారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఆహ్వానాలు అందజేశారు. రాత్రికి చిననాలుగురోడ్ల జంక్షన్, చేపల బజార్, వన్ వే ట్రాఫిక్ డౌన్, బండిగాడి వీధి జంక్షన్, చింతావారి వీధి, మెయిన్ రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద, స్టేషన్‌రోడ్డు, ఎంఎస్ రావు షాపింగ్ మాల్ వద్ద, శ్రీనివాస మెటల్ స్టోర్ వద్ద వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వేదికలను సిద్ధం చేస్తున్నారు. అర్ధరాత్రి పన్నెండు గంటలకు భారీ ఎత్తున బాణసంచా కాల్చనున్నారు. అలాగే మెయిన్ రోడ్డులోని భారీ ఎత్తున విద్యుత్ సెట్టింగ్‌లు, అలంకరణలు ఏర్పాటు చేశారు. అలాగే, విజయరామరాజుపేటలో విజయ గౌరీ యువజన సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున ఆది దంపతులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. రాత్రికి విజయరామరాజుపేట మెయిన్‌రోడ్డులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



విజయరామరాజుపేటలో విద్యుద్దీపాలంకరణ

రెండో రోజుకు ముఠా కార్మికుల సమ్మె

వర్తక సంఘాలు దుకాణాల బంద్‌తో

నిర్మానుష్యంగా మారిన బండిగాడి వీధి



ముఠా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఠా కార్మికులు కూలి రేట్లు పెంచాలని అనకాపల్లిలో చేస్తున్న సమ్మె రెండో రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ధరలు పెరుగుతున్న తరుణంలో చాలీచాలని ఆదాయంతో కార్మికుల కుటుంబాల ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వెంటనే చర్చలకు పిలిపించి, సమస్యను పరిష్కరించాల్సిన యాజమాన్యాలు అందుకు భిన్నంగా ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, పి.పరమేశ్వరరావు తదితరులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, జి.నర్సింగరావు, తిర్రి సురేష్, భీశెట్టి అప్పారావు తదితరులతో పాటు ముఠా కార్మికులు పాల్గొన్నారు.



దుకాణాల మూతతో నిర్మానుష్యంగా మారిన బండిగాడి వీధి

బోసిపోయిన బండిగాడి వీధి

నిత్యావసర వస్తువుల అమ్మకాలకు ప్రధాన కేంద్రమైన బండిగాడి వీధి రెండు రోజులుగా బోసిపోయింది. ముఠా కార్మికులు కూలి పెంచాలని సమ్మెకు దిగడం, వారు అడిగినట్టు రేట్లు పెంచలేమని తమకు కూడా వ్యాపారాలు లేవని వర్తక సంఘాల ఆధ్వర్యంలో వర్తకులు దుకాణాలను మూసివేయడంతో నిత్యావసర వస్తువులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్ రోడ్డు, పప్పులవీధి, బండిగాడి వీధి, వేదులవారి వీధిల్లో హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండేవి. వర్తకులు దుకాణాలు బంద్ పాటించడంతో ఆయా ప్రాంతాల్లో నిర్మానుష్య వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి నిత్యావసర సరకులు కొనుగోలుకు వచ్చిన ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందికి గ్రీవెన్స్



పోలీసు అధికారి సమస్య వింటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు హాజరై వారి వ్యక్తిగత, ఉద్యోగానికి సంబంధించిన పలు సమస్యలను ఎస్పీ తుహిన్‌సిన్హా దృష్టికి తీసుకెళ్లారు. అందరితో ఆయన స్వయంగా మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు.

ఎంపీఈవోలకు ఇన్సెంటివ్ మంజూరు చేయాలి

కొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఎంపీఈవోలకు 2022- 2023 ఆర్థిక సంవత్సరాలలో ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌ను ప్రభుత్వ మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లాల ఎంపీఈవోల సంఘం అధ్యక్షుడు పి.ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇన్సెంటివ్ ఇచ్చారని, కేవలం ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న వారికి మాత్రమే మంజూరు చేయలేదని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్నా కేవలం రూ.12వేలు గౌరవవేతనం మాత్రమే లభిస్తుందని వాపోయారు. తమ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వేడుకున్నారు.

దొంగగెడ్డ ఆక్రమణల తొలగింపులో వాగ్వాదం

పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని అడ్డుకున్న ఆక్రమణదారుడు

అంతకుముందు ఉన్న ఆక్రమణలు తొలగించాలని పట్టు



దొంగ గెడ్డను ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన దృశ్యం



కార్యదర్శి, సిబ్బందితో ఆక్రమణదారుడు వాగ్వాదం

కొత్తూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు పంచాయతీలోని దేవీనగర్‌ను ఆనుకొని ఉన్న దొంగగెడ్డ వద్ద ఆక్రమణలను తొలగించేందుకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శి సుభాష్‌ను, సిబ్బందిని ఆక్రమణదారులు అడ్డుకున్నారు. రెండు రోజుల క్రితం దొంగగెడ్డను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో చెట్లను తొలగించి, ఇంటికి ఎదురుగా ఖాళీ స్థలంలోని పెన్సింగ్ వేస్తున్నారని స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమణలు సరికాదని, తక్షణమే తొలగించాలని హెచ్చరించారు. దీనిపై ఆక్రమణదారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో శుక్రవారం వాటిని తొలగించేందుకు వెళ్లిన కార్యదర్శిని, సిబ్బందిని అడ్డుకున్నారు. ముందుగా ఉన్న ఆక్రమలను తొలగించాలని తరువాతే వీటిని కూడా తొలగించాలనిఆక్రమణదారుడు పట్టుబట్టారు. దీంతో చేసేది లేక అక్కడి నుంచి కార్యదర్శి వెళ్లిపోయారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతం మన్మోహన్‌సింగ్ ఘనతే

వాడవాడలా మాజీ ప్రధానికి పలువురు నివాళి

జాతికి ఆయన అందించిన సేవలను కీర్తించిన వక్తలు



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్ద నివాళి



అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పీలా అంజలి



బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తుమ్మపాల/ అనకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన మహనీయుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలు అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఆర్థికవేత్తగా దేశానికి మన్మోహన్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద మాట్లాడుతూ మచ్చలేని రాజకీయ నాయకులు మన్మోహన్‌సింగ్‌గా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పట్టణంలోని రింగురోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్‌కు ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎన్ కుమార్ మాట్లాడుతూ దేశానికి ఆర్థిక సంస్కరణలు చేసిన నేత మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా, న్యాయవాదులు రమణయ్య, స్వామి, గోవింద్, రాజశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఇద్దరికి తీవ్రగాయాలు

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లివానిపాలెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం తోటాడ పంచాయతీ పరిధి సిరసపల్లి గ్రామానికి చెందిన కోరుబిల్లి వెంకట జగ్గఅప్పారావు, అతని స్నేహితుడు ఎస్‌కే రహీమ్ ద్విచక్ర వాహనంపై దేశపాత్రునిపాలెం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. గొర్లివానిపాలెం వద్దకు వచ్చేసరికి అదే రహదారిలో వస్తున్న కారు వీరిని బలంగా ఢీకొన్నది. దీంతో ఇరువురికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఇక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు, మెడికల్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ ట్రేడ్‌లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాల భర్తీకి రిక్రూట్‌మెంట్ అధికారి, కమాండింగ్ ఆఫీసర్ గురుప్రీత్ అట్వాల్ నోటిఫికేషన్‌లు విడుదల చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ వాయు ప్రవేశం నోటిఫికేషన్ వివరాలు అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఐఎన్‌లో అందుబాటులో ఉన్నాయని, మెడికల్ అసిస్టెంట్, ఫార్మాసిస్ట్ ట్రేడ్‌లలో ఎయిర్‌మెన్ ఉద్యోగాల ఎంపికలు ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ద్వారా జరుగుతాయన్నారు. నోటిఫికేషన్ వివరాలు ఎయిర్‌మెన్ సెలక్షన్.సీడీఏసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

సంతోషిమాత ఆలయంలో ఏకాహం



అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద

అనకాపల్లి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం సంతోషిమాత ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఏకాహం నిర్వహించారు. పలు మహిళా మండళ్ల ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత అమ్మవారికి అర్చకులు విశేష పూజలు జరిపారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీధర్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాజ సులోచన, ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల రవికుమార్, బుద్ద ఈశ్వరరావు, పొలిమేర సన్యాసినాయుడు, పీలా రాజేష్, కర్రి మణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లెల్లో సీతారాముల విగ్రహాల ఊరేగింపు



సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, లంకెలపాలెం, వెన్నెలపాలెం గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సీతారాముల విగ్రహాలను ధార్మికజట్టు సభ్యులు పల్లకిలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. ఫౌండేషన్ సభ్యులు లాలం ఈశ్వరరావు, శ్రీనివాసరావు, వానపల్లి సూరిబాబు, జంగాల నాగేశ్వరరావు, బ్రహ్మాజీ, ద్వారపూడి శ్రీనివాసరావు, భద్రావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంఈవో రవీంద్రబాబు

సబ్బవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు విరివిగా మొక్కలు నాటాలని ఎంఈవో-2 రవీంద్ర బాబు అన్నారు. మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన విజ్ఞాన ప్రదర్శనలో మాట్లాడారు. మొక్కలు పెంచడాన్ని అంతా సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భాస్కర్, సునీత పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మా పరిశ్రమల్లో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా కృషి చేయాలని సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీటీసీ అర్జిల్లి దేవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీల నుంచి వ్యర్థ జలాలను పైపులైన్ ద్వారా సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్య సంపద నశించిపోతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. ఉపాధి కోసం 12 ఏళ్ల క్రితం రాంకీ ఫార్మాసిటీ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టామని, ఉపాధి కల్పిస్తామని అప్పట్లో రాంకీ యాజమాన్యం హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. వేట సాగక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఉపాధి కల్పించాలన్నారు.

రక్తదానానికి దాతలు ముందుకు రావాలి

» రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ దినేశ్ కుమార్


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాలకు సహకరించేందుకు దాతలు ముందుకు రావాలనికలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఏఎస్ దినేశ్‌కుమార్ కోరారు. కాఫీ హౌస్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇప్పటికే అనేక మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారన్నారు. ఆరు నెలలుగా జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ పాలకవర్గం లేనందున ఈ కార్యక్రమం కొంతమేర కుంటుపడినట్టు తెలిపారు. సభ్యులవినతి మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇటీవలే కార్యవర్గాన్ని ఏర్పాటుచేసి కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు డ్రైవ్ ఉంటుందన్నారు. ప్రస్తుతానికి 230 మంది వలంటీర్లు మాత్రమే ఉన్నారని, వీరి సంఖ్య పెంచాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలీస్, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, ఎంపీడీవోలు సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు విస్తృతం చేస్తున్నామన్నారు. డీఎస్పీ ప్రమోద్ కుమార్ శిబిరాన్ని సందర్శించారు. సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు ముందుంటామన్నారు. ఈశిబిరంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల పోలీసు స్టేషన్‌లకు చెందిన ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో 42 మం ది నుంచి 42 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.గౌరీశంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, సొసైటీ పాడేరుశాఖ ప్రతినిధులు ఎస్.గంగరాజు, పి.సూర్యారావు,గంగాభవాని, సుబ్రహ్మణ్యం, సంజీవరావు, ప్రసాద్ నాయుడు, రవి, శ్రీనివాస్, ఎం.మణి, రాఘవేంద్ర, వి.లోహితాస్ పాల్గొన్నారు.

హుకుంపేటలో పారిశుధ్య పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చెత్త తొలగిస్తున్న దృశ్యం

హుకుంపేట డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): హుకుంపేటలో పారిశుధ్యపనులు శుక్రవారం చేపట్టారు. ఈ నెల 22 న 'ఆంధ్రజ్యోతి'లో హు కుంపేటలో పారిశుధ్య లో పంపై వచ్చిన కథనంపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వీఆర్‌వో సాగర్ నేతృత్వంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. జేసీబీ సాయంతో చెత్త చెదారాలను తొలగించారు. పాత్త మంచి నీటి కుండీ శుభ్రం చేశారు. దీనిని వినియోగంలోకి తీసుకువస్తామని వీఆర్‌వో తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగదీశ్‌ను సంప్రదించినట్టు ఆయన తెలిపారు.

బొడ్డుమామిడిలో తీరిన తాగునీటి సమస్య


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణ

కొయ్యూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):బూదరాళ్ల పంచాయతీ ఎం. బొడ్డుమామిడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది.శుక్రవారం గ్రామంలో రూ 4.60 లక్షలతో నిర్మించిన రక్షిత పథకాన్ని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ ప్రారంభించారు. నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో బూదరాళ్ల పంచాయతీ ఎం.బొడ్డుమామిడి గ్రామాలకు భూమ్యాకర్షణ ద్వారా తాగు నీరందించేందుకు రూ. 4.60 లక్షలు వెచ్చించి పథకం ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాలకు సంబంధించి సుమారు 25 ఇళ్లలో జీవనం సాగిస్తున్న 124 మంది జనాబాకు ఈ పథకం ద్వారా తాగునీరందుతోంది. తాగునీటి వసతి కల్పించేందుకు ముందుకు వచ్చిన ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు బొడ్డుమామిడి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయికృష్ణ, నవ నిర్మాణ సమితి ప్రాజెక్టు మేనేజర్ కె. రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ వేణుగోపాల్, జూనియర్ ఇం జనీర్ బుజ్జిబాబు ఎంపీటీసీ నారాయణ, వార్డు సభ్యుడు సంజీవ్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

5 నుంచి యూటీఎఫ్ మహాసభలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరి 5 నుంచి కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభల కరపత్రాలు, పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కాకినాడ పీఆర్ కాలేజీలో జరగనున్నాయన్నారు. తమ సంఘం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సభ్యులు, మేధావులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రతినిధులు రాజు, గోపి, పరశురాం, శ్రీనివాస మూర్తి, రాధాకృష్ణ, పుండరీ, ధణపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వెళితే అరెస్టులు చేయడం దారుణం

» ఐటీడీఏ ఎదుట గురుకుల విద్యార్థి మృతిపై ఆందోళన

» తల్లిదండ్రులు, విద్యార్థి, గిరిజన సంఘాల నేతలు అరెస్టు


నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులను తరలిస్తున్న పోలీసులు

పాడేరురూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గురుకులంలో అనుమానాస్పద స్థితిలో పదో తరగతి విద్యార్థి మనోజ్ తేజ్ మృతిపై ఆందోళన చేస్తే పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, జీవన్‌కృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి నాయకులు శుక్రవారం ఐటీడీఏ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ స్థితిలో మృతుడు మనోజ్ తండ్రితో పాటు సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆ నాయకులు మాట్లాడుతూ, మనోజ్ తేజ్ కనిపించడం లేదని 15 రోజులు గా పాఠశాల, బంధువుల ఇళ్లచుట్టూ తిరిగి తల్లిదండ్రులు వెతికారన్నారు. చివరికి ఆ కుటుంబ సభ్యులకు యాజమాన్యం, పోలీసులు ఆ విద్యార్థి మృత దేహాన్ని అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో న్యాయం చేయాలని కోరుతూ ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థి తండ్రి వంతాల సత్యనారాయణ, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ఈడ్చుకుంటూ పోలీసు స్టేషన్‌కు తరలించి అరెస్టు చేయడం దారుణమని అన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదలచేసి మృతుడి కుటుంబానికి రూ. 50 లక్ష లు ఎక్స్‌గ్రేషియా, ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ విచారణ

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి మృతిపై నిజానిజాలు తెలుసుకుని న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన బాధిత తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నేతలను అరెస్టు చేయటం దుర్మార్గమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి జి. తనిష్ ఆరోపించారు. శుక్రవారం కొయ్యూరు గురుకుల పాఠశాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శితో కూడిన బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఇటీవల అనుమానాస్పద రీతిలోపదో తరగతి విద్యార్థి మనోజ్ తేజ్ మృతి చెంద డంపై విచారణ జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి మృతికి సిబ్బందిదే తప్పు అని ఆరోపించారు. వారిని తక్షణం విడుదల చేసి మనోజ్ తేజ్ కుటుంబానికి రూ. 10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌పై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృత కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర ఉద్యోగుల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉమ్మడి జిల్లా నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ బోధనేతర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. పాడేరులో తెలుగునాడు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, స్థానిక జీజే కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు, ముంచంగిపుట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.కొండన్నదొరలతో కలిసి ఉమ్మడి జిల్లా ఏపీజీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ రమణ ఆవిష్కరించారు. అనంతరం ఎస్వీ రమణ, శరగడం శ్రీనివాసరావు, కె.కొండన్నదొరలను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు ఎస్. మురళీమోహన్, కెసీహెచ్.నాయుడు, ఎం.అప్పలనాయుడు, మూర్తి, కె.జగదీశ్, డి.వెంకటరావు, డి.శ్రీనివాస్, పి.సత్యవతి పాల్గొన్నారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం డైరీ..

సీలేరు: తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం 2025 డైరీని మచిలీపట్నంలో శుక్రవారం ఘనంగా నిర్వహించినట్టు అప్పర్ సీ లేరు విద్యుత్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి ఎస్ భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెడన శాసన సభ్యుడు కృష్ణ ప్రసాద్, తెలుగునాడు అనుబంధ సంస్థ అధ్యక్షుడు గొట్టుముక్కల విజయరామరాజు, ముఖ్య అతిథులుగా, తెలుగునాడువిద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతనేని సాంబశివరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతు మధుసూదనరెడ్డి పాల్గొని డైరీని ఆవిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీలేరు బ్రాంచి అధ్యక్షుడు ఆర్. అప్పారావు, ఎన్ . వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మాతృభూమి' సేవలు అభినందనీయం'


డముకు వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

అనంతగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలోని గిరిజనులకు ఉచిత వైద్యసేవలను అందించడంలో కీలక పాత్ర వహిస్తున్న మాతృభూమి సేవా సంఘం సేవలు అభినందనీయమని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండిబ పంచాయతీ డముకు గ్రామంలో మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలోని వెంకటేశ్వర పుణ్యగిరి, హెల్పింగ్‌హ్యాండ్స్, సంజీవని ఆస్పత్రుల సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. గిరిజనులను వైద్యసేవలందుతున్న తీరును అడిగితెలుసుకున్నారు. పేదలకు రగ్గులను పంపిణీ చేశారు. అనంతరం కంటిపురంలోని క్రిస్మస్ వేడుకల్లో శ్రావణ్‌కుమార్ పాల్గొని, కేక్ కట్‌చేసి ఏసుక్రీస్తు గొప్పతనంపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పున్నమ్మ, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, నాయకులు టి.ఆనందరావు, ఎం.జోగులు, మోహన్‌రావు, గ్రామీణ వైద్యులు నగేష్ డముకు యూత్ నాయకులు రమేశ్, సలీమ్, కిరణ్, ప్రవీణ్, కొండమ్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత'


మావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా స్థాయి బాల్య వివాహాల నియంత్రణ హైబ్రీడ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పీవీటీజీ తెగలో బాల్య వివాహాలు జరుగుతున్నందున వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత రెండేళ్లలో 25 బాల్య వివాహాలు నిరోధించినా, 357 మంది టీనేజీ గర్భవతులు, 174 మంది బాలింతలుండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో అవగాహన కల్పించి భవిష్యత్తులో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరిగితే ఆయా గ్రామ కమిటీలని బాధ్యులను చేసి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 2,276 మంది డ్రాపవుట్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం లేదా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎక్కువ డ్రాపవుట్స్ ఉన్న జీకేవీధి మండలంను పైలెట్ గా తీసుకుని జనవరి 3వ తేదీ నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మలత, డీఈవో బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో ఎస్‌కే జమీల్ బాషా, డీఎస్డీవో రోహిణి, సీఐ జీనబంధు, ఐసీడీఎస్ ఏపీడీలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

యూనివర్సిటీ క్రీడలకు డిగ్రీ విద్యార్థిని ఎంపిక


వాలీబాల్ పోటీలకు ఎంపికైన లక్ష్మి

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేరళలో జనవరిలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ క్రీడకు స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థిని కిల్లుడు లక్ష్మి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ రాణి తెలిపారు. కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మి యూనివర్సిటీ పరిధి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు ఆమెను ఎంపిక చేశారన్నారు. తమ కళాశాల విద్యార్థినీ జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొననడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా పీడీ శివరామ్‌కుమార్‌ని అభినందించారు.

చీడిగుంటలో రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ధారకొండ సర్పంచ్ రాజు, ఎంపీటీసీ రామన్న

సీలేరు, డిసెంబరు 27 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతి పరిధిలోని చీడిగుంట గ్రామంలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ సభ్యుడు మాడి రమన్న ప్రారంభించారు. రూ. 2 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఈ సీసీ రోడ్డును మంజూరు చేసింది. ఈ మేరకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శెట్టి కాసులమ్మ, కూటమి నాయకులు పొత్తూరు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పెసా ఎన్నికలు: ఎంపీడీవో



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెసా కమిటీ ఎన్నికల విధులను ప్రిసైడింగ్ అధికారులు కట్టుదిట్టంగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీవో ఎస్‌యూవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పేసా ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 350 గ్రామాలను 59 పేసా గ్రామాలకు రూపొందించామన్నారు. ఈ గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ప్రజలు ఎన్నుకుంటారన్నారు. ఈ కమిటీలకు సర్పంచ్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారన్నారు. ఈనెల 31 నుంచి జనవరి రెండో తేదీ వరకు వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 3,4తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈఎన్నికలకు గ్రామ జనాభాలో మూడు వంతుల ఓటర్లు హాజరుకావాలన్నారు. 50శాతం మంది గిరిజనులు కచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కంటా జాహ్నవి, ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, 15మంది ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు.

కందిరీగల దాడి


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కేశవరావు

పెదబయలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కందిరీగలు దాడిలో దంపతులు అస్వస్థత పాలయ్యారు. లక్ష్మీపేట పంచాయతీ చల్దిమామిడి గ్రామానికి చెందిన నరంజి కేశవరావు, భార్య అప్పలమ్మ శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని వారి కాఫీ తోటలో కాఫీ పండ్ల సేకరణకు వెళ్లారు. ఇంతలో కందిరీగల గుంపు వారిపై దాడి చేశాయి. వెంటనే వారిద్దరూ గడ్డివాములోకి రక్షణ పొందారు. వెంటనే కుటుంబసభ్యులు చేరుకుని హుటాహుటీన ఆటోలో పెదబయలు పీహెచ్‌సీకి వారిని తరలించారు. వైద్యాధికారి నిఖిల్ పరీక్షించి వైద్య సేవలు అందించారు. సకాలంలో తీసుకురావడంతో దంపతులిద్దరికీ ప్రమాదం తప్పిందని వైద్యాధికారి తెలిపారు.

మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయం


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు మన్మోహన్‌సింగ్ మృతిపై సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఆర్థికమంత్రిగా, ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. అలాగే, పాతబస్‌స్టాండ్ వద్ద వర్తక సంఘం నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు చిరంజీవి, వర్తకసంఘం నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, దూనబోయిన రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య: ఎంఈవో

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని స్థానిక ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం చౌటపాడు పాఠశాలలో ఎంఈవో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాల్లో పట్టు సాధించేందుకు ఎఫ్ఎల్ఎన్, టీఏఆర్ఎల్ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో విధిగా మెనూపాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు, ప్రధానోపాధ్యాయులు కుడుమల కాంతారావు, ఆర్పీ వెంకట రమణ, సీఆర్పీ ప్రశాంతి, విజయకుమార్ పాల్గొన్నారు.

అధికంగా మద్యం సేవించిన గిరిజనుడు మృతి


మృతుడు నాగేశ్వరరావు

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం సంతపాకలు వద్ద మద్యం అధికంగా సేవించిన ఓ గిరిజనుడు మృత్యువాత పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... అన్నవరం పంచాయతీ చోడరాయి గ్రామానికి చెందిన ముమ్వల నాగేశ్వరరావు (50) గురువారం సాయంత్రం మద్యం అధికంగా సేవించాడు. రాత్రి సంతపాకలోనే ని ద్రించాడు. చలి తీవ్రతకు శుక్రవారం ఉదయానికి ఆయన మృతి చెందాడు.

నష్ట పరిహారం కోసం వృద్ధురాలి ఆందోళన


రంగశీలలో నేషనల్ హైవేతో నష్టపోయిన బాధితురాలు

హుకుంపేట డిసెంబరు 27 ఆంధ్రజ్యోతి; నేషనల్ హైవే రోడ్డు పనులతో భూమిని నష్టపోయిన తనకు పరిహారం అందించాలని గిరిజన వృద్ధురాలు సాగరి రంభ డిమాండ్ చేశారు. మండలంలోని రంగశీల పంచాయతీ కేంద్రానికి చెందిన ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సర్వే నంబరు 75-4లో విస్తీర్ణంలో 0.86 సెంట్ల భూమి రోడ్డు పనులకు మట్టి వినియోగించుకుని తనకు కనీస పరిహారం ఇవ్వలేదన్నారు. దీని వల్ల వ్యవసాయం చేయడానికివీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు కాంట్రాక్టర్‌ను అడుగుతుంటే అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతున్నారు. ఈ విషయం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్‌కు భూ సర్వే చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అం దేలా చూడాలన్నారు. కానీ, ఈ ఆదేశాలూ అమలుకాక కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నానని ఆమె వాపోయారు.



అరకు: మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత బాలదేవ్


పెదబయలులో భిక్షాటన చేస్తున్న వలంటీర్లు

'వలంటీర్లకు అన్యాయం చేయొద్దు'

అరకులోయ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో వలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు వారిని కొనసాగించాలని అల్లూరి జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ప్ర ధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా మండలంలో వలంటీర్లు సమస్యలపై స్థానిక అంబేడ్కర్ వి గ్రహం ఎదుట రిలే దీక్షలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం బాలదేవ్ వారికి మద్దతుగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టి రూ.12వేలు వేతనం చెల్లిస్తామని చెప్పి మోసగించిందన్నారు. కూటమి నాయకులు రూ. 10వేలు, ఉద్యోగభద్రత కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికి 6 నెలలు కావస్తున్నా ఆ హామీ అమలు చేయలేదని ఆరోపించారు. ఆ కార్యక్రమంలో వలంటీర్లు యూనియన్ నాయకులు ఆనంద్, శాంతి, కుమార్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవాలని గ్రామ వలంటీర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పనికి తగిన వేతనం అందిస్తామని, విధుల్లోకి తీసుకుంటామని ఇచ్చిన హామీ అమలు చేయాలని వలంటీర్లు ఈ సందర్భంగా కోరారు. తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ వారు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరావు, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాద్, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవ పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో గ్రామ వలంటీర్లు శుక్రవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమను తొలగించడంతోపాటు, ఏడు నెలల బకాయి వేతనాలు కుటుంబాలతో పస్తులతో గడుపుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తంచేశారు.

జిల్లాలో రాగల ఐదు రోజులు వ్యవసాయ పనులకు వాతావరణం అనుకూలం

చింతపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రాగల ఐదు రోజులు వ్యవసాయ పనులకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ సందర్భంగా అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో జనవరి ఒకటో తేదీ వరకు వర్షసూచనలేదన్నారు. అందువల్ల రైతులు వరి నూర్పులు, కాఫీ పండ్ల సేకరణ పనులు చేసుకోవచ్చునన్నారు.

ఐనాడ రెవెన్యూ సదస్సులో 150 ఫిర్యాదులు


కోసంగిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

పాడేరురూరల్, 27 (ఆంధ్రజ్యోతి):భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సరిహద్దు గ్రామా ల ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని తహసీల్దార్ వంజంగి త్రినాధ రావునాయుడు సూచించారు.మండలంలోని మారుమూల ఐనాడ పంచా యతీలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు, భూ సరిహద్దుల సమస్యలు, ముటేషన్‌ల సమస్యలపై 150 ఫిర్యాదులను అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ జె.బిమలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు టి.ఎర్రయ్యమ్మ, గ్రామ పెద్దలు, డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ బి.నల్లన్న, మండల సర్వేయర్ వి.భీమయ్య, ఆర్ఐ కూడా భాస్కరరావు, వీఆర్‌వో ఆర్.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు అప్పన్న కోరారు. శుక్రవారం నడింపాలెం పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా భూ సంబంధ సమస్యలపై 116 వినతులు స్వీకరించారు. వీటిలో అధికంగా మ్యూటేషన్‌లకు 43, ఎఫ్‌లైన్‌కు 17 ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలకు 8 వినతులు వచ్చాయి. వెబ్ ల్యాండ్‌కు సంబంధించి 18, గృహ పట్టాలకు ఒక వినతి వచ్చింది. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ అప్పన్న, సర్వేయర్, వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గిరిజన రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని ఉప సర్పంచ్ జగ్గునాయుడు కోరారు. మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది సద్దు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్సంటేజీలు ఇవ్వలేదని బిల్లులు ఆపేస్తున్నారు

పంచాయతీరాజ్ శాఖాధికారులపై సభ్యుల మండిపాటు

గరంగరంగా మండల సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేసిన అభివృద్ధి పనులకు నెలలు తరబడి బిల్లులు మంజూరు చేయడం లేదని, పంచాయతీ రాజ్ అధికారులకు పర్సంటేజీలు ఇవ్వలేదని బిల్లులు ఆపేస్తున్నారని ప్రజా ప్రతినిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీలు తదితర భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేసిన వారు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గొలుగొండపేట ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ మాట్లాడుతూ గొలుగొండపేటలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేశామని, సచివాలయం కూడా ప్రారంభించేశారని, అయితే పీఆర్ అధికారులు అడిగిన పర్సంటేజీలు ఇవ్వలేదని నేటికీ బిల్లులు మంజూరు చేయలేదని తెలిపారు. అలాగే వెదురుపల్లిలో అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించి ఏడాదికిపైగా పూర్తయినా బిల్లులు మంజూరు చేయాలని పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మ దృష్టికి అక్కడ ప్రజా ప్రతినిధి తీసుకువచ్చారు. అలాగే ములగపూడి తదితర చోట్ల చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స మాట్లాడుతూ పీఆర్ అధికారులు చేసిన పనులకు సకాలంలో ఎంబీబుక్ రికార్డు చేయకుండా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీనికి ఎంపీపీ లక్ష్మణమూర్తి స్పందిస్తూ మండలంలో చేసిన అభివృద్ధి పనులకు పీఆర్ అధికారులు సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చూడాలని ఆదేశించారు. శరభూపాలపట్నం సర్పంచ్ లోకవరపు సత్యనారాయణ మాట్లాడుతూ తమ గ్రామానికి తాగునీటి ట్యాంకు మంజూరై ఏడాది కావస్తున్నా నేటికి పనులు ప్రారంభం కాలేదని, ఉన్న తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, ఈ ట్యాంకు కూలిపోతే తాగునీటికి ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. గొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ మాట్లాడుతూ వర్షాలకు పొలంలో కోసి ఉంచిన వరి పనలు తడిసిపోయి ధాన్యం మొలకలు వచ్చాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చమ్మచింత సర్పంచ్ వెలగాడ కొండబాబు మాట్లాడుతూ పిన్‌డిపాలెంలో హౌసింగ్‌కు ఇచ్చిన స్థలంలో కొందరు వరిసాగు చేస్తున్నారని, ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఐసీడీఎస్ పీవో గౌరి మాట్లాడుతూ మూడు నెలల లోపు పిల్లలకు ఆధార్‌కార్డులు చేయించుకోవాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఇప్పటివరకు 24 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. గునుపూడి ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో డయేరియా రాకుండా సర్పంచులు తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయించాలని కోరారు. గొలుగొండపేట సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ జల్‌జీవన్ పనులలో భాగంగా అధికారులు ఉన్న పైపులైన్‌లను తవ్వేస్తూ కొత్త పైపులైన్‌లు వేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తుతుందని తెలిపారు. అనంతరం మాజీ ప్రదాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా మండల సభ్యులు మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల వ్యవసాయాదికారి పార్థసారధి, ఎంఈవో-1, 2 సత్యనారాయణ, కె.వరహాలబాబు, హౌసింగ్ ఏఈ రామజోగరావు, ఉపాధి పథకం ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్కులో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర ట్రైబల్ కల్చలర్ జాయింట్ సెక్రటరీ ఉమ నండూరి తదితరులు

అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక

▸▸ కేంద్ర ట్రైబుల్ కల్చర్ జాయింట్ సెక్రటరీ ఉమ నండూరి

కృష్ణాదేవిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడియాడిన స్మారక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని కేంద్ర ట్రైబల్ కల్చరల్ జాయింట్ సెక్రటరీ ఉమ నండూరి అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామ రాజు పార్కును సందర్శించి అల్లూరి, గంటందొర సమాధులు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్కులో ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన అల్లూరి జీవిత చరిత్ర చిత్రపటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అల్లూరి, గంటందొర సమాధులున్న కృష్ణాదేవిపేట పార్కులో శిథిలమైన కట్టడాలు, భవనాల అభివృద్ధిపై కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రికి నివేదిస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ అల్లూరి పార్కు, కొయ్యూరు, రాజేంద్రపాలెం స్మారక ప్రాంతాలతోపాటు నర్సీపట్నంలో ఫైటర్, కవర్డుల సమాధి ప్రాంతాలను కలుపుతూ టూరిజం హబ్‌గా తయారు చేయాలని భావిస్తున్నామన్నారు. అల్లూరి పార్కులో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పర్యాటకులకు తాగునీరందించేందుకు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం తెలుగు రాష్ట్రాల కార్యదర్శి నడిపల్లి నానిరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పి.రఘురామరాజు, క్షత్రియ సంఘం నాయకులు రాజాసాగిన చంటి, రాధాకృష్ణరాజు, దంతులూరి సుబ్రహ్మణ్యరాజు, గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, కొయ్యూరు తహసీల్దార్ ప్రసాద్, గొలుగొండ ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఆర్ఐ.నాగరాజు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన



గోవాడ ఫ్యాక్టరీ ఆవరణలో బైఠాయించిన నినాదాలు చేస్తున్న కార్మికులు

చోడవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలతో పాటు ఇతర సమస్యలపై షుగర్స్ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గుర్తింపు కార్మిక సంఘం కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. యాజమాన్యం కార్మికుల సమస్యల పట్ల వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, కాంట్రాక్టు కార్మికులకు ఇతర కార్మికులకు సంబంధించిన అలవెన్సులు, డీఎలు, ఇతర బకాయిలు ఇవ్వలేదని గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీవీఎస్ భాస్కరరావు విమర్శించారు. ఫ్యాక్టరీ ఎండీ వ్యవహారశైలి వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు జగన్నాథరావు, నాగభూషణం, రామకృష్ణ, అప్పారావు, శ్రీను, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన మహిళలు

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఖాళీలు ఏర్పడ్డ చౌక ధరల దుకాణాలు నిర్వహకులు నియామకానికి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. డివిజన్‌లో ఖాళీలు ఏర్పడ్డ 37 చౌక దుకాణాల డీలర్లు నియామకానికి రాత పరీక్షకు ఆహ్వానించగా 25 ఖాళీలకు మాత్రమే పరీక్షలు రాశారు. మిగిలిన సభ్యులు గైర్హాజరు అయ్యారు. 25 ఖాళీలకు వంద మంది రాత పరీక్షలు రాయగా 67 మంది అర్హత సాధించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 67 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారి తుది జాబితాను సబ్ కలెక్టర్ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఆర్డీవో వీవీ.రమణ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, మైనింగ్ ఏడీ శివాజీ, తహసీల్దార్ రామారావు, సీడీపీవో మేరీ సువార్త పాల్గొన్నారు.

అయ్యన్న విద్యా సంస్థలు మరింత విస్తరించాలి

రాష్ట్ర వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుమార్



మెడల్స్, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో చైర్మన్ కుమార్

కె.కోటపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఆశయంతో డాక్టర్ ఖాశీం స్థాపించిన అయ్యన్న విద్యా సంస్థలు భవిష్యత్తులో మరింత విస్తరించాలని రాష్ట్ర వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ ఆకాంక్షించారు. ఆల్ ఇండియా చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటేషన్‌లో అయ్యన్న స్కూల్ విద్యార్థులు 26 మంది మెడల్స్ ప్రశంసా పత్రాలను సాధించారు. ఆ పతకాలను, ప్రశంసా పత్రాలను శుక్రవారం డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో పీవీజీ చేతుల మీదుగా విజేత విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టే, విద్యలో కూడా రాణించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. చిత్రలేఖనం పోటీలకు శిక్షణ ఇచ్చిన ప్రిన్సిపాల్ సుమతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కశిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, దొగ్గ దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైవాడ జలాశయాన్ని సందర్శించిన చైర్మన్

దేవరాపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రైవాడ జలాశయాన్ని నూతనంగా ఎన్నికైన చైర్మన్ పోతల పాత్రునాయుడు, డీఈఈ సత్యంనాయుడు శుక్రవారం పరిశీలించారు. ఎడమ, కుడి కాలువలు ఇంటేక్ చాంబర్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జలాశయాన్ని అభివృద్ధి చేస్తామని చైర్మన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంట ఏఈఈలు నందకిశోర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో సాంకేతిక పరిజ్ఞానం

▸▸ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాసరావు

మాకవరపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి పాలిటెక్నిక్ విద్య పునాదిలా దోహదపడుతుందని పర్యాటక శాఖ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అవంతి కళాశాలలో రెండు రోజులు పాటు జరగనున్న సృజన 2కె24 కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మన్మోహన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ముత్తంశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ బోధించిడానికి అనుమతులు జారీ చేసినట్టు చెప్పారు. సృజన 2కె 24వంటి కార్యక్రమాలు విద్యార్థిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా వినూత్న సాంకేతిక ఆలోచనలు వెలికి తీస్తాయని చెప్పారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వారందరూ పాలిటెక్నిక్ అభ్యంచిన వారేనని చెప్పారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి మంచి అడుగులు వేయాలని సూచించారు. సాంకేతిక నమోనాల ప్రదర్శన ద్వారా నైపుణ్యం బయటపడతుందన్నారు. అనంతరం 81 సాంకేతిక నమోనాలు, 50 పత్రికలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో చోడవరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కోసం ఆదివాసీల వినూత్న నిరసన



ఖాళీ పళ్లాలతో నిరసన తెలుపుతున్న నేరేడుబంద, జీలుగులోవ ఆదివాసీలు

రావికమతం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించి జీవనోపాధి చూపాలని కొండశిఖరం గ్రామాలైన నేరేడుబంద, జీలుగులోవ, సోంపురం బందుల తదితర ప్రాంతాల గిరిజనులు శుక్రవారం జీలుగులోవలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీవీటీజీ గిరిజన సంఘ నాయకుడు కొర్ర బాలరాజు మాట్లాడుతూ చీమలపాడు శివారు కొండశిఖరంపై ఉన్న మూడు గిరిజన గ్రామాలలో పీవీటీజీ తెగకు చెందిన 28 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఫారెస్ట్ పట్టా భూముల సాగుతో జీవనోపాధి సాగిస్తున్న తమకు ఉపాధి పథకం జాబ్ కార్డులు ఇచ్చినా ఉపాధి పనులు కల్పించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొండపై తమకు జీవనోపాధి లేక పిల్లాపాపలను విడిచి విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొండశిఖర గ్రామాల గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించినా ఇక్కడ అధికారులు మాత్రం పనులు చూపలేదన్నారు. పలుమార్లు పనులు కల్పించాలని విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉపాధి పనులు కల్పించాలని, లేకుంటే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

▸▸ నర్సీపట్నం డీఎస్పీ మోహన్



పట్టణ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ మోహన్ ఆదేశించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టిసారించాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి గస్తీ మెరుగుపరచాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవిందరావు, ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

▸▸ అనకాపల్లి డీఎస్పీ శ్రావణి



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

రావికమతం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి చెప్పారు. కొత్తకోట, రావికమతం పోలీస్ స్టేషన్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్ లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. ఫిర్యాదుదారులు, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేండా ఉక్కుపాదం మోపాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కోటేశ్వరావు, ఎస్ఐలు ఎం.శ్రీనివాస్, రఘువర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంపై అవగాహన ర్యాలీ

చోడవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వచ్చే నెల 5న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం అన్ని కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ విద్యార్థులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సద్భావ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పాక రాజేష్, ప్రతినిధులు కె.చలపతి, పసుమర్తి మల్లిక్, గీత లక్ష్మి, డి.కుమారి, పుట్టా శ్రీనివాసరావు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ పీవో మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ ధర్నా



నర్సీపట్నంలో నిరసన ర్యాలీ చేస్తున్న వైసీపీ శ్రేణులు

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ శ్రేణులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు బాదుడుపై వైసీపీ పోరుబాట పేరుతో పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ర్యాలీని ప్రారంభించారు. ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేసి పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం ఈఈ వీడీవీ.రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, సీహెచ్.సన్యాసిపాత్రుడు, రుత్తల ఎర్రాపాత్రుడు, డాక్టర్ లక్ష్మీకాంత్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట...



ఏడీఈకి వినతిపత్రం ఇస్తున్న ధర్మశ్రీ, వైసీపీ నాయకులు

చోడవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైసీపీ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆందోళన అనంతరం ఈపీడీసీ ఎల్ ఏడీఈకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాల సైంటిస్టులు

▸▸ అధునిక సాంకేతిక ఇంటి నమూనా ఆవిష్కరించిన విద్యార్థులు



ఆధునాతన ఇంటి నమూనా తయారు చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెట్టారు. ఎంతో శ్రద్ధ పెట్టి ఆధునాతన హంగులతో ఇంటి నమూనా తయారు చేశారు. ఇంటికి ఫైర్ అలెర్ట్ అలారమ్, వాటర్ అలెర్ట్ అలారమ్ యూనిట్లు అమర్చారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, మేడ మీద వాటర్ ట్యాంక్ నిండిపోయి నీరు వృథాగా పోతున్నప్పుడు ఇంట్లో ఉన్నవారిని అప్రమత్తం చేస్తుందని విద్యార్థులు కె.లోకేశ్, ఎం.సందీప్ చెప్పారు. శనివారం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్నన సృజన 2కె- 2024లో ప్రదర్శిస్తామని చెప్పారు. విద్యార్థులు తయారు చేసిన అధునాతన ఇంటి నమూనా ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంది.

29న మెగా వైద్య శిబిరం

నర్సీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ తెలిపారు. శనివారం వైద్య శిబిరానికి సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం, కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సాధారణ వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ శిబిరాన్ని ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు బ్రేక్ రేపు

చోడవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈపీడీసీఎల్ రూరల్ ఏఈ వీడీవీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం చేపట్టే పనుల నిమిత్తం విద్యుత్ లైన్లు వేసేందుకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. వెంకన్నపాలెం, నరసాపురం, గంధవరం, గోవాడ, అంబేరుపురం, గజపతినగరం, జుత్తాడ, రాయపురాజుపేట, శేమునాపల్లి, సింహాద్రిపురం, భోగాపురం తదితర పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

మాకవరపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు కోరారు. వెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వేలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ సర్వే వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, ఆర్ఐలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళులు

మాడుగుల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పడాల కొండలరావు ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో శుక్రవారం మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. పార్టీ నేత ఏసు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో పశువైద్య శిబిరం

మాకవరపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి రాకుండా తగిన చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి హరిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

రావికమతం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. చోడవరానికి చెందిన ఫోర్ జీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో 35 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను అందించారు. అనంతరం హెచ్ఎం కృష్ణకుమారి మాట్లాడుతూ ఫోర్ జీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ సంస్థ భవిత కేంద్రం విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రి కూడా అందించడం ఆనందకరమని చెప్పారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

రోలుగుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చే నెల 5న నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డు, ఎంట్రీ పాస్ ఉంటేనే సభకు అనుమతి ఇస్తారన్నారు. అన్ని పంచాయతీల నుంచి కార్యకర్తలు తరలిరావాలని, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మునాయుడు, కార్యదర్శి పచ్చిగొళ్ల ఈశ్వరరావు, నాయకులు ఆడారి గణష్, తమరాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎరకంపేటలో రెవెన్యూ సదస్సు

గొలుగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరకంపేట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెవెన్యూ పరమైన సమస్యలపై పది దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది నల్లబెల్లి రాజు, నాయకులు బి.సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఆమె గజ్జె కడితే.. పురస్కారమే!

కూచిపూడి నృత్యంలో అపర్ణ అద్భుత ప్రతిభ



అపర్ణ

- తొమ్మిదో ఏట అరంగేట్రం
- 16 ఏళ్లకే వందలాది ప్రదర్శనలు
- ఉత్తమ ప్రదర్శనలకు అవార్డులు, బిరుదులు
- చదువులోనూ ఉత్తమంగా రాణింపు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

చిన్నప్పటి నుంచి ఆమెకు నృత్యమంటే ప్రాణం. తొమ్మిదో ఏటనే గజ్జెకట్టి కూచిపూడి నృత్యంలో అరంగేట్రం చేసింది. పదహారేళ్ల ప్రాయానికే వందలాది ప్రదర్శనలిచ్చి ఉత్తమ కళాకారిణిగా అవార్డులు, రివార్డులు అందుకుంది. చదువుతో పాటు కళారంగంలో రాణిస్తూ ఎన్నో బిరుదులు సాధించింది మధురవాడ పిలకవానిపాలేనికి చెందిన ఎస్.ఎస్.బి.అపర్ణ.

మధురవాడ సమీప పిలకవానిపాలేనికి చెందిన శ్రీదేవి, జనార్దనరావు దంపతులకు 2008 ఆగస్టులో జన్మించిన అపర్ణ తొమ్మిదో ఏట నుంచి కూచిపూడి నృత్యాభ్యాసం ప్రారంభించింది. తండ్రి వ్యాపారి కాగా తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి నాట్యంపై అమిత ప్రేమ ఉన్న తమ కుమార్తెకు నృత్యంలో శిక్షణ ఇప్పించారు. నగరంలోని నేవీచిల్డ్రన్స్ స్కూల్‌లో ప్లస్‌వన్ చదువుతున్న అపర్ణ గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 75 శాతం మార్కులు సాధించింది. విజయనగరం సంగీత కళాశాల నుంచి కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్సు చేసింది. ఎన్‌సీసీలో ఎ సర్టిఫికెట్ పొందింది. ఈమెకు ఇటీవల బెంగళూరుకు చెందిన ఓ సంస్థ కూచిపూడి మరకతమణి సౌత్‌ఇండియా ఉమెన్ ఎచీవర్ అవార్డు-2024ను ఇచ్చి గౌరవించింది. గత ఏడేళ్లుగా దేశంలోని అనేక ప్రాంతాల్లో సుమారు 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల మన్ననలు అందుకుంది.





సౌత్‌ఇండియా ఉమెన్ ఎచీవర్ అవార్డుతో అపర్ణ

అనేక అవార్డులు

అపర్ణ ఏడేళ్లలో వందకు పైగా అవార్డులు, రివార్డులు సాధించింది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఎక్స్‌లెన్సీ బుక్ ఆఫ్ రికార్డు, సౌత్ ఇండియా ఆర్ట్స్ అండ్ కల్చర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో పేరు సంపాదించింది. నాట్యబాల, నాట్య కుసుమ, స్వామి వివేకానంద కళా పురస్కారం, గరుడకీర్తి, నృత్య ప్రతిభ, ఉగాది పురస్కారాలు అందుకుంది. అలాగే శివనంది, నాట్యకిన్నెర, నాట్యసాధక్, కీర్తికిరణం, నాట్యకౌముది, భారత కళాతిలక్, ఇందిరా ప్రియదర్శిని, నాట్యకళామయూరి, నాట్యశిరోమణి వంటి అవార్డులు సాధించింది. రామ్‌చరణ్ ట్రోఫీలో ప్రత్యేక జ్యూరీ అవార్డు, మిలాన్-2023, 2024 అవార్డులతో పాటు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ శత జయంత్యుత్సవాల్లో ప్రదర్శనలిచ్చి మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా సత్కారం పొందింది.

కనకమహాలక్ష్మికి లక్ష పుష్పార్చన

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు



ఆలయంలో నిర్వహించిన లక్ష పుష్పార్చన పూజలో పాల్గొన్న భక్తులు



పుష్పార్చనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

ఎలమంచిలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ధర్మవరం ప్రాంతంలో వున్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. వేద పండితులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రెండున్నర గంటలపాటు లక్షపుష్పార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొఠారు సాంబ, ప్రతినిధులు కొఠారు కొండబాబు, రాము, మడగల సత్యనారాయణ, రాజు తదితరులు లక్ష పుష్పార్చన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకారం అందించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ



అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ

పాయకరావుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎంఎస్ బాలాజీ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీచేశారు. సిబ్బంది అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్, ఓపీ, ఫార్మసీ, టీబీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. డెలివరీ వార్డు, ఆయుష్ విభాగాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన అదనపు భవన నిర్మాణ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుభాశ్, డాక్టర్ పద్మావతి, ఎంపీహెచ్ఈఓ పీవీ రమణ వున్నారు.

రాజాధిరాజ వాహనంపై ఉపమాక వెంకన్న





మాడవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ. (ఇన్‌సెట్‌లో) రాజాధిరాజ వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజాధిరాజ వాహనంపై రత్న కిరీటధారుడైన ఉపమాక వేంకటేశ్వరస్వామి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, నిత్య హోమాలు చేశారు. రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారు, పల్లకీపై గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించి, మాడవీధుల్లో ఊరేగించారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన డీఈ

- సమస్యలను చెప్పుకున్న నివాసితులు



టిడ్కో గృహసముదాయంలో శ్లాబ్ నుంచి నీరు కారుతున్న ఫ్లాట్‌ను పరిశీలిస్తున్న డీఈ సంధ్య

ఎలమంచిలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని శ్రీరామ్‌నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని శుక్రవారం టిడ్కో డీఈ సంధ్య సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్లాట్లలో లీకేజీ సమస్యలు వున్నాయని, డ్రైనేజీలు అసంపూర్తిగా ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె బీ-1 బ్లాకులో లీకేజీలను పరిశీలించారు. మరమ్మతు పనులు చేసేందుకు సిబ్బందిని పంపిస్తున్నామని, కానీ వారు వచ్చిన సమయంలో కొంతమంది ఇళ్లకు తాళం వేసివుంటున్నదని ఆమె చెప్పారు. సిబ్బందిని మరోసారి పంపిస్తామని, ఫ్లాట్ల యజమానులు దగ్గరుండి మరమ్మతు పనులు చేయించుకోవాలని ఆమె సూచించారు.

ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్: ఒకరి మృతి

గొలుగొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆగి వున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాతకృష్ణాదేవిపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు నర్సీపట్నం నుంచి బైక్ వస్తుండగా గొలుగొండ దళిత కాలనీ వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో పెదపూడి రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై గొలుగొండ ఎస్ఐ రామారావుకు స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. ప్రమాదానికి కారణమైన నాతవరం మండలానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనపర్చుకున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 31నే పంపిణీ

- జిల్లాలో 2,54,448 మంది లబ్ధిదారులు
- రూ.106.1 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

అనకాపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జనవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల కోసం ప్రభుత్వం రూ.106.1 కోట్లు విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. జనవరి ఒకటో తేదీన నూతన సంవత్సర వేడుకలు ఉన్నందున పింఛన్‌దారులకు ఇబ్బంది కలగకుండా ఒకరోజు ముందుగానే.. అంటే ఈ నెల 31వ తేదీనే పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. నూరు శాతం మందికి అదే రోజున పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని, ఒకవేళ ఎవరైనా పింఛన్ డబ్బులు తీసుకోలేకపోతే మరోసటి రోజు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో అన్ని రకాల పింఛన్‌దారులు 2,54,448 మంది వున్నారని, ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఆయా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామని, సచివాలయాల సిబ్బంది వీటిని ముందుగానే డ్రా చేసుకొని పింఛన్‌దారులకు సకాలంలో అందజేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు.

కుక్కలు దాడి.. 15 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

రాంబిల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద పాలెం గ్రామంలో శుక్రవారం వీధి కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఇసరపు రమణ తన గొర్రెల మందను గురువారం రాత్రి స్థానికంగా ఉన్న ఒక కొబ్బరి తోటలో ఉంచి, చుట్టూ ఇనుప కంచె వేశాడు. శుక్రవారం ఉదయం ఎవరూలేని సమయంలో కుక్కల గుంపు కొబ్బరి తోటలోకి ప్రవేశించి గొర్రెలపై విచక్షణారహితంగా దాడి చేశాయి. సుమారు 30 గొర్రెలు తప్పించుకుని తలోదిక్కుకు పారిపోగా, 15 గొర్రెలు కుక్కలబారినపడి మృతిచెందాయి. కొద్దిసేపటి తరువాత విషయం తెలుసుకున్న రమణ అక్కడకు వచ్చి తీవ్ర ఆవేదన చెందాడు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా డైరెక్టర్ జి.దేముడునాయుడు వచ్చి మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. కుక్కల దాడిలో గొర్రెలను కోల్పోయిన రమణను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

కొత్తవీధి బైపాస్ రోడ్డుకి మార్గం సుగమం

... 5వ పేజీ తరువాయి

నాటించారు. ఈ పనులకు సుమారు రూ.1.25 కోట్లు ఖర్చు చేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఇంకా వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి కొత్తవీధి శ్మశానవాటిక వరకు, డాన్ బాస్కో కాలేజీ వెనుక భాగంలో చర్చి దగ్గర బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. అదే విధంగా వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి కొత్తవీధి వరకు రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు శాసనసభ స్పీకర్ అయ్యారు. ఆయన చొరవతో 15వ ఆర్థిక సంఘం నిధులతో మిగిలిన రోడ్డు పనులు పూర్తి చేయడానికి మునిసిపల్ అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. శ్మశానవాటిక నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు రోడ్డుకి ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణానికి రూ.44.87 లక్షలు, చర్చి దగ్గర నుంచి డాన్‌బాస్కో కళాశాల వరకు బీటీ రోడ్డుకి రూ.33 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. కొత్తవీధి నుంచి వేంకటేశ్వర స్వామి గుడి వరకు మిగిలిన పనులు పూర్తి చేస్తే బైపాస్ రోడ్డు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెదబొడ్డేపల్లి వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గుతుంది. పెదబొడ్డేపల్లి, చెట్టుపల్లి వెళ్లే ద్విచక్రవాహనాలు, ఆటోలు టౌన్‌లోకి వచ్చే అవసరం లేకుండా సరస్వతి జంక్షన్ దగ్గర నుంచి వేంకటేశ్వర స్వామి గుడి, కొత్తవీధి రోడ్డు మీదుగా పెద్దబొడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క నుంచి చోడవరం వైపు వెళ్లే మెయిన్ రోడ్డులోకి ప్రవేశించవచ్చు. కిలో మీటరుపైగా దూరం తగ్గడంతోపాటు ట్రాఫిక్ సమస్య కూడా తొలగుతుంది.

విశాఖ స్మృతిలో మన్మోహన్‌సింగ్

... 5వ పేజీ తరువాయి

సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2008 జనవరి మూడో తేదీన మన్మోహన్‌సింగ్ ప్రారంభించారు. యూజీసీ చైర్మన్‌గా మన్మోహన్‌సింగ్..అనేకమంది వర్సిటీ ఆచార్యులు, శాస్త్రవేత్తలతో కలసి పనిచేశారు. సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొని సహచర మిత్రులను పలకరించారు. రెండోసారి ప్రధాని అయిన తరువాత 2009 జూలై 26న భార్యతో కలిసి ఆయన విశాఖపట్నం విచ్చేశారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఐఎన్ఎస్ అరిహంత్‌ను నేవల్ డాక్‌యార్డులో ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆప్యాయంగా పలకరించారని కాంగ్రెస్ నేతలు గుర్తుచేసుకుంటున్నారు. దేశాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటని పేర్కొంటూ ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం

నర్సీపట్నం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతిపట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం వ్యక్తం చేశారు. తన హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థకు నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. ఆర్థికవేత్తగా దూర దృష్టితో ఆలోచించి మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదం చేశాయన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

క్రైం... crime news

ఒడ్డిమెట్ట వద్ద దాబాలో గో మాంసం వంటకాలు!



దాబాలో మాంసం వంటకాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ధార్మిక పరిషత్ ప్రతినిధి కరాటే కల్యాణి, ఇతర సభ్యులు

నక్కపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డిమెట్ట వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఒక దాబాలో గో మాంసంతో తయారు చేసిన వంటకాలను వడ్డిస్తున్నట్టు హిందూ ధార్మిక సంస్థ ప్రతినిధుల తనిఖీల్లో బయటపడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు శుక్రవారం రాత్రి ఒడ్డిమెట్ట వద్ద పెట్రోల్ బంకు పక్కన వున్న దాబాకు వెళ్లి బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీలో మాంసం ముక్కలు పెద్దవిగా వుండడంతో అనుమానం వచ్చి, ఇతర జంతువులమాంసం ఏమైనా కలిపారా అని సిబ్బందిని ప్రశ్నించారు. అటువంటిది ఏమీ లేదని వాళ్లు బదులిచ్చారు. అయినప్పటికీ యువకులు అనుమానం చెందుతూ పాయకరావుపేటకు చెందిన హిందూ ధార్మిక సంస్థ ప్రతినిధి ఎన్.శ్రీనుకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వెంటనే రాష్ట్ర ధార్మిక పరిషత్ ప్రతినిధి కరాటే కల్యాణి, ఇతర ప్రతినిధులకు ఫోన్‌లో సమాచారం అందజేశారు. కొద్దిసేపకి వారంతా దాబాకు చేరుకున్నారు. కిచెన్‌లో వండిన మాంసం కూరను పరిశీలించారు. ఇది ముమ్మాటికీ గో మాంసమేనని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబుకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వచ్చి మాంసాన్ని పరిశీలించారు. సుమారు మూడు కిలోల మాంసాన్ని సీజ్ చేశారు. శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి పరిశీలించిన తరువాత గో మాంసమేనని తేలితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి కార్మికుడి మృతి



నాగరాజు (ఫైల్‌ఫొటో)

పరవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ పైనుంచి కాలు జారి కింద పడడంతో కార్మికుడు మృతిచెందాడు. దేశపాత్రునిపాలెం శివారు శేషాద్రినగర్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శేషాద్రినగర్‌లో జీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధ్వర్యంలో అపార్టుమెంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కూర్మన్నపాలేనికి చెందిన చోడి నాగరాజు(46) ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో నాలుగో అంతస్థు పరంజిపై నిలబడి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు కేజీహెచ్‌కు తరలించారు. నాగరాజును పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య అప్పలనర్సమ్మ, కుమారుడు ధనుంజయ్, కుమార్తె నందిత ఉన్నారు. ఇతని స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కడకెల్లా గ్రామం. కొంతకాలం నుంచి కుటుంబంతోసహా కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి ప్రమాదం.. ఒకరి మృతి

కొత్తూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం చింతనిప్పుల అగ్రహారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా భార్య, పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖలోని వేపగుంటకు చెందిన ముద్దాడ రాజేంద్ర(35)భార్య, కుమారుడు, కుమార్తె కలిసి ద్విచక్రవాహనంపై ఒంపోలు వెళుతున్నాడు. దారిలో సీహెచ్ఎన్ అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై ఆకస్మికంగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. రాజేంద్ర తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య పిల్లలకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరు విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.